సాక్షి ఒడిశా

ఆదివారం । 9 । జూలై । 2023



**శ్రీమందిరం ఆదాయం లెక్కింపు**

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ. 5,10,553లు, బంగారం 200 మిల్లీగ్రాములు, వెండి 72 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



**నకిలీ గోల్డ్‌తో రుణాలు**

- 8లో



**'నిరుద్యోగులకు ఉపాధి కరువు'**

- 8లో

## న్యూస్‌రీల్

### నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపట్టాలి

• ఎస్పీ సర్వాణ్ వివేక్



సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ సర్వాణ్ వివేక్

బరంపురం: సమాజానికి, ప్రజలకు జవాబు దారీగా పనిచేస్తున్న పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపట్టాలని బరంపురం ఎస్పీ సర్వాణ్ వివేక్ సూచించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయ సమావేశ మందిరంలో క్రైమ్‌పై సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరాల చేసిన జాబితాలో ఉండి తప్పించుకొని తిరుగుతున్న వారికి అరెస్టు వారెంట్ జారీచేసి అరెస్టు చేయాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాల్లో తలదాచుకుంటున్న నేరస్తుల సమాచారం సేకరించి చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పోలీసుస్టేషన్లలో నమోదవుతున్న కేసులకు సరైన దర్యాప్తు చేపట్టి చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఏఎస్పీలు, డీఎస్పీలు, ఎస్డీపీవోలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

### ఆటోబోల్తా


• ఆరుగురు వ్యక్తులకు తీవ్రగాయాలు



నుజ్జునుజ్జు అయిన ఆటో

జయపురం: గుప్తేశ్వర్‌కు సామగ్రి తీసుకెళ్తున్న ఒక ఆటో బొయిపరిగుడ–గుప్తేశ్వర్ మధ్యనున్న డొకిరీ ఘాట్‌లో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆరుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వారిని రామగిరి ప్రాథమిక వైద్య కేంద్రంలో చేర్చారు. అనంతరం వారిని మెరుగైన చికిత్స కోసం జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. వివరాల్లోకి వెళ్తే.. శ్రావణ మాసం మొదటి సోమవారం గుప్తేశ్వరుడిని దర్శించుకునేందుకు భోల్‌భం భక్తులతో పాటు శివ భక్తులు ఎక్కువగా వస్తారు. దీంతో గుప్తేశ్వర్‌లో గోదుమ పిండి, సూజీ, పంచదార, నూనె మొదలగు సామాన్లు అమ్మేందుకు కోట్‌పాడ్ సమితి పాత్రగుడ గ్రామం నుంచి ఆరుగురు వ్యక్తులు ఒక ఆటోలో సామగ్రి తీసుకెళ్తున్న సమయంలో ఆటో బోల్తా పడింది. దీంతో ఆ మార్గంలో వెళ్తున్న కొంతమంది క్షతగాత్రులను రక్షించి, వారిని మరో ఆటోలో రామగిరి ప్రాథమిక వైద్య కేంద్రానికి తీసుకొచ్చారు. వెంటనే రామగిరి పోలీసు అధికారి బలరాం హికాక సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు.

### ప్రజలకు పట్టాల పంపిణీ



ప్రజలకు పట్టాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని 3వ వార్డు ప్రజలకు నవరంగ్‌పూర్ ఎంపీ రమేష్ చంద్ర మాఝి చేతులమీదుగా పట్టాలను శనివారం పంపిణీ చేశారు. తమకు పట్టాలు ఇప్పించాలని కోరుతూ గతేడాది కలెక్టర్ కార్యాలయం వద్ద వార్డు ప్రజలు ధర్నా చేపట్టారు. దీంతో ఆరు నెలల క్రితం అర్హుల జాబితాను సేకరించి ప్రభుత్వానికి పంపడంతో 264 మందికి పట్టాలు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం యోజన పథకాలు అందజేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో మల్కన్‌గిరి జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సోమారీ టంగులు, మల్కన్‌గిరి పురపాలక అధ్యక్షుడు మానోజ్ బారిక్, పురపాలక ఉపాధ్యక్షురాలు కవిత మొహంత్, తహసీల్దార్ సయ్యాద్ సాబీర్ సాహా, మల్కన్‌గిరి గిరిజన అభివృద్ధి శాఖ అధ్యక్షుడు అడ్మార్వ, మాజీ ఎమ్మెల్యే మానాస్ మాడ్కమి తదితరులు పాల్గొన్నారు.



పట్టాలు చూపిస్తున్న మహిళలు

# రథాలపై అనధికార వ్యక్తులు







రథాలపై అనధికారికంగా ఎక్కిన సేవాయత్‌యేతర సభ్యులు

• బయటపడుతున్న తప్పిదాలు
• సోషల్ మీడియాలో కలకలం

భువనేశ్వర్: పూరీలో ఈ ఏడాది జరిగిన శ్రీజగన్నాథుని రథయాత్రలో పలు తప్పిదాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. యాత్ర నిర్వివాదంగా విజయవంతం చేసేందుకు ఆలయ పాలక, అధికారిక వర్గాలు పలు మార్గదర్శకాలు జారీ చేసిన విషయం తెలిసిందే. వీటిలో భాగంగా రథాలపై మూల విరాటులకు పూజాదులు వగైరా కార్యకలాపాలతో ముడిపడిన సేవాయత్‌లు మాత్రమే రథంపై ఎక్కేందుకు అనుమతించబడతారు. ఇతర వ్యక్తులు ఎవరినీ రథాలపైకి ఎక్కేందుకు అనుమతించేది లేదు. అలాగే రథాలపైకి ఎక్కేందుకు అనుమతి పొందిన సేవాయత్‌లు, ఇతర వర్గాల వ్యక్తులు, సిబ్బంది ఎట్టి పరిస్థితుల్లోనూ మొబైల్ ఫోను వినియోగించరాదని స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. వీటి ఉల్లంఘనకు పాల్పడితే యంత్రాంగం కఠినంగా వ్యవహరిస్తుందని హెచ్చరించారు.

**నీరుగారిన మార్గదర్శకాలు..?**

వాస్తవానికి ఈ హెచ్చరికలు సమగ్రంగా నీరుగారిపోయినట్లు సోషల్ మీడియా ప్రసారాలు అద్దం పడుతున్నాయి. పలువురు సేవాయత్‌యేతర వ్యక్తులు మూల విరాటుల తాళ ధ్వజం, దర్ప దళనం మరియు నందిఘోష్ రథాలపైకి వెళ్లి మూలవిరాటులతో ఆలింగనం ఫోజులతో ఫొటోలు తీసుకుని వీడియో రీల్స్ ప్రసారం చేశారు. విస్తారంగా ప్రసారం అవుతున్న ఈ దృశ్యాలు యాత్రలో అధికార యంత్రాంగం భద్రతా చర్యలు చేపట్టడంలో నిలువునా విఫలమైనట్లు రుజువు చేస్తున్నాయి. ఇదిలా ఉండగా ఈ చర్యను కొంతమంది సీనియర్ సేవాయత్‌లు తేలికపాటి విషయంగా పరిగణిస్తున్నారు. ఆంక్షలు, పరిమితులు ఎప్పుడు ఉన్నవేనని, నిన్న మొన్నటి వరకు జరిగిన వాస్తవ సంఘటనలను చవిచూసిన వారమేనని ఈ వర్గం వ్యాఖ్యానిస్తోంది. రథాలపై దేవుళ్లకు సేవలు చేయడంలో చేయూతగా నిలిచేందుకు పలువురు యువ సేవాయత్‌లు రథాలపైకి రావడం షరా మామూలు విషయంగా సీనియర్ సేవాయత్ బినాయక్ దాస్ మహాపాత్రో పేర్కొన్నారు. రథాలపై మొబైల్ ఫోన్ల వ్యవహారంపై వర్ధమాన దైనందిన జీవనంలో మొబైల్ ఫోను లేకుండా ఏదీ సాధ్యం కాదని మద్దతు ప్రకటించారు. మరో వర్గం సేవాయత్‌లు నియమ నిబంధనల ఉల్లంఘనపై కఠిన చర్యలు చేపట్టడం అవసరమేనని హితవు పలికారు. ఈ పరిస్థితుల పట్ల శ్రీమందిరం పాలక, అధికారిక వర్గాల వైఖరి స్పష్టం కాలేదు.

## డయేరియా నియంత్రణపై సమావేశం



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో డెంగీ, మలేరియా, డయేరియా నియంత్రణపై జిల్లాస్థాయి టాస్క్ ఫోర్సు సమన్వయ కమిటీ సమావేశాన్ని స్థానిక జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ మాట్లాడుతూ.. సమితి మండల కేంద్రాల్లో వర్షాకాలంలో తగు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పర్లాకిమిడి మున్సిపాలిటీ, కాశీనగర్ ఎన్‌ఏసీలో మురికి కాలువలు శుభ్రం చేసి డీడీటీ స్ప్రే చేయాలని సూచించారు. జిల్లాలో 2022-23 సంవత్సరంలో 101 మంది రోగులను ప్రభుత్వం గుర్తించిందన్నారు. వారిలో ఎక్కువగా మోహనా, గుసాని, పర్లాకిమిడిలో ఉన్నారని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, సీడీఎంవో డాక్టర్ ప్రదీప్ పాత్రో, అదనపు కార్యనిర్వాహణ అధికారి (జిల్లా పరిషత్) జ్యోతిరాజ్, అదనపు చికిత్స అధికారి డా.ప్రమోద్ కుమార్ పండా, డీపీహెచ్‌వో డా.ముబారక్ అలీ, డీపీఎం సౌమ్యరాణి గొడో తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

• జిల్లా జడ్జి సత్యనారాయణ



రాయగడ: సెంచూరియన్ స్కూల్‌లో మొక్కలు నాటుతున్న నివేదిత పండ

రాయగడ: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని జిల్లా జడ్జి సత్యనారాయణ సొడంగి అన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయ సహాయ సంస్థ ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యానికి మొక్కల ఆవశ్యకతపై విద్యార్థుల్లో చైతన్యం అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు పర్యావరణంపై అవగాహన ఉండాలని సూచించారు. మొక్కల సంరక్షణకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అలాగే స్థానిక పితామహల్ వద్దనున్న సెంచూరియన్ పబ్లిక్ స్కూల్‌లో వన మహోత్సవం జరిగింది. జిల్లా న్యాయ సహాయ సంస్థ కార్యదర్శి నివేదిత పండ ముఖ్య అతిథిగా హాజరై పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో స్కూల్ డైరక్టర్ రాజేష్ పాఢి తదితరులు పాల్గొన్నారు.



రాయగడ: మొక్కలు నాటుతున్న జిల్లా జడ్జి సొడంగి

### మహిళ అనుమానాస్పద మృతి



మత్తిలి ఆరోగ్య కేంద్రంలో మహిళ మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌లో ఒక మహిళ శనివారం అనుమానాస్పదంగా మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. శుక్రవారం సాయంత్రం చిత్రకొండ నుంచి 10 కేజీల గంజాయిని తెస్తున్న ఎంవీ 66 గ్రామానికి చెందిన ప్రీతి అనే మహిళను, మత్తిలి పోలీసుస్టేషన్ పరిధిలోని కమలపాడ్ గ్రామం వద్ద పోలీసులు అరెస్టు చేశారు. అయితే ఆమె శనివారం మధ్యాహ్నం సెల్‌లో మరణించింది. ఆపస్మారక స్థితిలో ఉన్న ఆమెను గమనించిన అబ్కారీ సిబ్బంది మత్తిలి ఆరోగ్య కేంద్రానికి వెంటనే తరలించారు. అక్కడ ఆమెను పరిశీలించిన వైద్యులు మృతి చెంది రెండు గంటలు అవుతోందని తెలియజేశారు. అయితే ఆమె మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆమె మృతికి పోలీసులే కారణమని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. పోలీసులు ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి ఎక్సైజ్ సిబ్బందిపై దర్యాప్తు చేస్తున్నారు.

## విచారణ ప్రారంభం

• 5 రోజుల రిమాండ్‌కు అనుమతి



సీబీఐ రిమాండ్‌లో ఉన్న నిందితులు

భువనేశ్వర్: బాలాసోర్ జిల్లా బహనాగా బజార్ రైల్వేస్టేషన్ వద్ద ట్రిపుల్ రైలు ప్రమాదంలో ప్రమేయం ఉన్న ముగ్గురు రైల్వే అధికారులను ఐదుగురు సభ్యుల సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) బృందం శనివారం విచారణ ప్రారంభించింది. నగరం శివారు చందకా పోలీసుస్టేషన్‌లో ఈ విచారణ కొనసాగిస్తున్నారు. 5 రోజుల రిమాండ్‌లో భాగంగా విచారణ చేపట్టారు. సీబీఐ అరెస్టు చేసిన వారిలో సీనియర్ సెక్షన్ ఇంజినీర్ (సిగ్నల్) అరుణ్ కుమార్ మహంత, సెక్షన్ ఇంజినీర్ మహ్మద్ అమీర్ ఖాన్ మరియు టెక్నీషియన్ పప్పు కుమార్ ఉన్నారు. భారత శిక్షాస్మృతి చట్టం ప్రకారం హత్య ఉద్దేశం కాకున్నా మరణానికి కారకులు (సెక్షన్ 304), సాక్ష్యాల గల్లంతు (సెక్షన్ 201) వంటి నేరారోపణలతో వీరికి వ్యతిరేకంగా కేసులు నమోదయ్యాయి. ఈ కోణంలో నిందితుల విచారణ లోతుగా కొనసాగుతోంది. ఈ దుర్ఘటనకు సంబంధించి మరో రైల్వే ఉద్యోగికి సీబీఐ దర్యాప్తు బృందం నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. ముగ్గురు రైల్వే అధికారులను 5 రోజుల రిమాండ్‌కు తరలించేందుకు భువనేశ్వర్‌లోని ప్రత్యేక సీబీఐ కోర్టు శుక్రవారం కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐకి అనుమతినిచ్చింది. అరెస్టు అనంతరం ముగ్గురు నిందితులను శుక్రవారం సాయంత్రం భువనేశ్వర్‌లో సీబీఐ కార్యాలయానికి తీసుకొచ్చారు. సీబీఐ కార్యాలయంలో కొద్దిసేపు బస చేసిన తర్వాత వారిని వైద్య పరీక్షల నిమిత్తం పటిష్ట భద్రత మధ్య స్థానిక క్యాపిటల్ ఆస్పత్రికి తరలించారు. వైద్య పరీక్షల అనంతరం నిందితులను భువనేశ్వర్ ప్రత్యేక సీబీఐ కోర్టులో హాజరుపరిచారు, తదుపరి విచారణ కోసం సీబీఐ 5 రోజుల రిమాండ్‌ను అభ్యర్థించింది. ఈ అభ్యర్థనపై న్యాయస్థానం సానుకూలంగా స్పందించింది. ప్రమాదం జరిగినప్పుడు తమ ఉద్యోగాల్లో ఉన్న ముగ్గురు రైల్వే అధికారులే ప్రమాదానికి కారణమని సీబీఐ గుర్తించింది. ఈ నిర్లక్ష్యం హత్యగా కాకున్న ప్రాణహానికి కారణంగా నిర్ధారించింది. దీంతో పాటు సాక్ష్యాలను దాచిపెట్టేందుకు ప్రయత్నించారని వారిపై అభియోగాలు మోపారు. ఈ చర్య భారత శిక్షాస్మృతి చట్టాలని వ్యతిరేకంగా సీబీఐ భావించింది.

# ఓపీఎస్‌సీ ప్రయాణం అద్భుతం



వ్యవస్థాపన దినోత్సవ సంచిక ఆవిష్కరిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్ తదితరులు

• సాంకేతిక పరిజ్ఞానంతో పారదర్శకత
• సీఎం నవీన్ పట్నాయక్



ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి నవీన్

భువనేశ్వర్: రాష్ట్రంలోని ఉద్యోగుల నియామకాల్లో ఓపీఎస్‌సీ 75 ఏళ్ల ప్రయాణం అద్భుతమైనదని సీఎం నవీన్‌పట్నాయక్ పేర్కొన్నారు. ఒడిశా పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఓపీఎస్‌సీ) 75వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలకు శనివారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓపీఎస్‌సీ చైర్మన్ మరియు సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కమిషన్ కార్యకలాపాల్లో లోగడ విశేష కృషి చేసిన మాజీ చైర్మన్లు, సభ్యులను అభినందించారు. అనతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాలన రంగానికి ధీటైన అభ్యర్థులను ఎంపిక చేసి, వేలాది మంది అభివృద్ధికి ఈ సంస్థ అద్భుతమైన సహకారం అందిస్తోందన్నారు. ఇటీవల కాలంలో ఒడిశా పబ్లిక్ సర్వీస్ కమిషన్ భారీ సంఖ్యలో భర్తీ సన్నాహాలు చేస్తోందన్నారు. ఈ సన్నాహాలు వేగంగా నిర్వహించేలా చేయడంలో సంస్థ సత్ఫలితాలు సాధించడం అభినందనీయమని ప్రశంసించారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం అభ్యర్థుల ఎంపిక, భర్తీ ప్రక్రియలో సాంకేతికతను ఉపయోగించుకోవడం మరియు ఉత్తమ పద్ధతులను అనుసరించడం ద్వారా పారదర్శకతను కొనసాగించగలుగుతోందని ప్రోత్సహించారు.

**ఉత్సాహంతో పనిచేయాలి**

రిక్రూట్‌మెంట్లలో బ్యాక్‌లాగ్‌లను క్లియర్ చేయడం, వార్షిక రిక్రూట్‌మెంట్ క్యాలెండర్‌ను పాటించడంలో నిరంతరం కృషి చేస్తున్న ఓపీఎస్‌సీ మరియు సిబ్బంది సేవలు మరింత ఉత్సాహంతో కొనసాగాలని పిలుపునిచ్చారు. ఈ సంస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం మొదటి నుంచి ఆసక్తి చూపుతోందని ఉద్ఘాటించారు. ఓపీఎస్‌సీ కొత్త అనుబంధ భవనం నిర్మాణ దశలో ఉందని, దీని వ్యయ ప్రణాళిక రూ.14 కోట్లుగా ప్రకటించారు. ఒడిశా పబ్లిక్ సర్వీసు కమిషను కేడర్ పునర్ వ్యవస్థీకరణ ప్రభుత్వం క్రియాశీల పరిశీలనలో ఉందని తెలిపారు. సుసంపన్నమైన, బలమైన ఒడిశా నిర్మాణానికి కమిషన్ సహకారం కొనసాగిస్తుందని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

## జగన్నాథసాగర్ ఆధునికీకరణకు చర్యలు



జగన్నాథ్ సాగర్‌ను పరిశీలిస్తున్న ఆనంద్ తదితరులు

జయపురం: స్థానిక చారిత్రాత్మక జగన్నాథ సాగర్ ఆధునికీకరణకు అధికారులు చర్యలు చేపట్టారు. సాగర్‌కు పూర్వస్థితిని తీసుకొచ్చేందుకు బెంగుళూర్ లేక్‌మేన్ ఆనంద మాలిగాబిడ్‌ను రప్పించారు. శనివారం ఆయన జగన్నాథ్ సాగర్‌ను సందర్శించి పరిస్థితిని అధ్యయనం చేశారు. అనంతరం సాగర్ అభివృద్ధిపై ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి, మున్సిపల్ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, వైస్ చైర్‌పర్సన్ బి.సునీత, కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్ తదితరులతో చర్చించారు. ఎమ్మెల్యే బాహిణీపతి జయపురం సాగర్ అభివృద్ధికి కోసం రాష్ట్ర ప్రభుత్వంపై చాలా రోజుల నుంచి ఒత్తిడి తీసుకొస్తుండడంతో సాగర్‌ను అభివృద్ధి చేసేందుకు నిర్ణయించింది. దీనిలో భాగంగా రూ.10 నుంచి రూ.12 కోట్ల ఖర్చుతో సాగర్ ఆధునికీకరణ పనులు చేపడతారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమవ్వడంతో అక్టోబర్ నుంచి పనులు ప్రారంభిస్తారు. అయితే ఆరు నెలల్లో పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచించారు.



జగన్నాథ్ సాగర్ పనులపై లేక్‌మేన్ ఆనంద్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి తదితరులు

# రాజీయే రాజమార్గం



జయపురం: కేసులు విచారిస్తున్న జిల్లా జడ్జి సత్యనారాయణ మిశ్ర తదితరులు



బరంపురం: కేసులు పరిష్కరిస్తున్న జిల్లా జడ్జి మొలయ రంజన్ దాస్ తదితరులు



బరంపురం: కోర్టు బయట వేచివున్న కక్షిదారులు

బరంపురం: పలు కేసుల్లో రాజీయే రాజమార్గమని జిల్లా జడ్జి మలయో రంజన్ దాస్ అన్నారు. స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉన్న సివిల్ కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ శనివారం నిర్వహించారు. దీనిలో భాగంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు వందలాది కేసులను పరిష్కరించారు. ప్రతి ఒక్కరూ లోక్ అదాలత్‌లను వినియోగించుకొని, సత్వర పరిష్కారం పొందాలని సూచించారు.

జయపురం: స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో జిల్లాస్థాయి లోక్ అదాలత్‌లో 174 కేసులను పరిష్కరించినట్లు అధికారులు వెల్లడించారు. లోక్ అదాలత్‌లో రోడ్డు ప్రమాద కేసులు, కుటుంబ వివాదాలు, ఎన్‌ఐ యాక్ట్ కేసులు, అండర్ సెక్షన్ 138 తదితర కేసులు పరిష్కరించారు. విడిపోయిన ఒక జంట వివాదాన్ని పరిష్కరించి వారిని కలిపారు. లోక్ అదాలత్‌లో జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ అధ్యక్షుడు సత్యనారాయణ మిశ్ర, స్వతంత్ర్య విజిలెన్స్ జడ్జి రాజేష్ ఎక్కా, ఫ్యామిలీ కోర్టు జడ్జి డాక్టర్ పవిత్రమోహన సామల్, అదనపు జిల్లా జడ్జి మరియు పోస్కో జడ్జి సీహెచ్ వాసుదేవ పాత్రో, ప్రధాన విచార విభాగ జడ్జి దిలీప్ కుమార్ సాహు, సివిల్ కోర్టు రిజిస్ట్రార్ విష్ణు ప్రసాద్ దేవత, సీనియర్ సివిల్ జడ్జిలు రేఖారాణి పండ, అంజలి మాచఖండ్, శాశ్వత లోక్ అదాలత్ జడ్జి, న్యాయసేవా ప్రదీకరణ కార్యదర్శి సుమన్ జెన, ఎస్‌డీజేఎం సంతోష్ కుమార్ బారిక్, ఆదర్శ కుమార్ బెహర తదితరులు కేసులు విచారించారు. జిల్లా బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాదులు శశానంద మిశ్ర, త్రినాథ్ సింగ్‌లాల్, సత్యనారాయణ ఆచారి, మనోజ్ మాల దీనబంధు తదితరులు కేసులు పరిష్కరించడంతో సహకరించారు.

## క్లుప్తంగా

### ఆశ్రమ పాఠశాల తనిఖీ



విద్యార్థుల ప్రతిభను పరిశీలిస్తున్న కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్

**పర్లాకిమిడి:** గజపతి జిల్లా ఆర్.ఉదయగిరి సమితి రాంపూర్ వద్దనున్న సబరపల్లి ఆశ్రమ పాఠశాలను కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థినులకు మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనం, తాగునీటి సౌకర్యాలపై ఉపాధ్యాయులు, వార్డెన్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అలాగే విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**రామభద్రపురం:** మండలంలోని ఆరికతోట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఆరికతోట గ్రామానికి చెందిన గ్రీన్ అంబాసిడర్ మామిడి గౌరి(55) శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విజయనగరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ సురేంద్రనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### రెండు బైక్‌లు ఢీకొని ఐదుగురికి గాయాలు



ప్రమాదంలో గాయాల పాలైన చిన్నారి లాస్య

**శృంగవరపుకోట:** పట్టణంలో విశాఖ – అరుకు రోడ్డులో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు గాయాల పాలయ్యారు. ఉదయం 6.30 గంటల సమయంలో వేపాడ మండలం బొద్దాం గ్రామానికి చెందిన జేసీబీ ఆపరేటర్ తూర్పాటి సతీష్ తన భార్య శాంతి, కుమార్తె లాస్య, కుమారుడు తనుష్‌లతో కలిసి గుడికి వెళ్లేందుకు బైక్‌పై ఎస్.కోట బయల్దేరారు. ఎస్.కోట పట్టణంలోకి ప్రవేశిస్తున్న సమయంలో స్థానిక ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో బైక్‌కి పెట్రోల్ పోయించుకుని ప్రధాన రహదారి పైకి వస్తున్న అల్లు జగదీష్‌ను బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో సతీష్ కుటుంబ సభ్యులతో పాటూ జగదీష్‌కు గాయాలయ్యాయి. రెండు బైక్‌లు బాగా దెబ్బతిన్నాయి. కాగా ప్రమాదంలో చిన్నారి లాస్య తీవ్ర గాయాల పాలైంది. ఆమెను స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేసినప్పటికీ చెవులు, ముక్కు నుంచి రక్తస్రావం కావటంతో విశాఖకు తరలించారు. తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్.కోట పోలీసులు చెప్పారు.

### వాహనం ఢీకొని జింక మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జింక

**భోగాపురం:** మండలంలోని పోలిపల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి చెందింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఎస్‌ఐ కృష్ణమూర్తి సంఘటన స్థలానికి చేరుకుని మృతి చెందిన జింకను పరిశీలించారు. అనంతరం మృతి చెందిన జింకను ఫారెస్ట్ అధికారులకు అప్పగించారు. ప్రమాదంలో చనిపోయిన జింక వయసు సుమారు మూడు సంవత్సరాలు ఉంటుందని ఫారెస్ట్ అధికారులు తెలిపారు.

### పీడీఎస్ బియ్యం పట్టివేత

**రామభద్రపురం:** మండలంలోని కొట్టక్కి గ్రామంలో శనివారం విజిలెన్స్ అధికారులు 500 కేజీల పీడీఎస్ బియ్యం పట్టుకున్నారు. సీఎస్‌డీటీ సాయికృష్ణ తెలిపిన వివరాలు... కొట్టక్కి గ్రామంలో పీడీఎస్ బియ్యం అక్రమంగా కొనుగోలు చేస్తున్నారన్న సమాచారం మేరకు విజిలెన్స్ సీఐ బి. సింహాచలంతో పాటు సీఎస్‌డీటీ, విజిలెన్స్ సిబ్బంది కలిసి తనిఖీలు చేశారు.

### సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

**విజయనగరం రూరల్:** సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి భాస్కరరావు సూచించారు. విజయనగరం మండలంలోని దుప్పాడ గ్రామాన్ని శనివారం ఉదయం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రాకోడు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.జగదీష్, వైద్య సిబ్బందితో కలసి గ్రామంలో పర్యటించారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. రాకోడు పీహెచ్‌సీ సీహెచ్‌ఓ మాణిక్యం, ఎంపీహెచ్‌ఈఓ సన్యాసిరావు, హెచ్‌వీ జయ, సిబ్బంది శ్రీను, కృష్ణ పాల్గొన్నారు.

# నకిలీ గోల్డ్‌తో రుణాలు

- బ్యాంక్‌ను మోసం చేసిన అప్రైజర్
- 11 మందికి రూ. 44.75 లక్షలు మంజూరు
- మేనేజర్ ఫిర్యాదుతో ఏడుగురు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఐఐసీ బబులీ నాయక్

**పర్లాకిమిడి:** గజపతి జిల్లా పర్లాకిమిడి బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచిలో బంగారు రుణాలు తీసుకోవడంలో భారీ మోసం జరిగింది. ఈ ఘటనలో గోల్డు రుణాలు మంజూరు చేసిన గోల్డు అప్రైజర్ గన్నవరపు బ్రహ్మంతో పాటు మరో 11 మందిని పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఈనెల 5వ తేదీన బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి మేనేజర్ మనోజ్ కుమార్ పలక స్థానిక ఆదర్శ పోలీసుస్టేషన్‌లో పదకొండు మంది రుణగ్రస్తులపై ఫిర్యాదు చేశాడు. మొత్తం 21 గోల్డు లోన్స్‌కి సంబంధించి 11 మంది అకౌంట్లకు రూ. 44.75 లక్షలు ట్రాన్స్‌ఫర్ అయ్యాయని తెలియజేశారు. అయితే బ్యాంకు అధికారి బలరాం సాహు ఆ అకౌంట్లకు సంబంధించిన 21 గోల్డు లోన్స్ ప్యాకెట్లను తెరిచి చూడగా అవి నకిలీ బంగారు వస్తువులుగా తేలిందన్నారు. ఈ మోసంపై దర్యాప్తు చేయడానికి సంబల్‌పూర్ బ్యాంకు జోనల్ ఆఫీసు ఏరియా మేనేజర్ చంద్రశేఖర సాహును నియమించారు. అలాగే మొత్తం గోల్డు లోన్స్ ప్యాకెట్స్ తనిఖీకి గంజాం జిల్లా కోనిసి గ్రామ బ్రాంచ్‌కి చెందిన అప్రైజర్ సి.జగన్నాథరావు ఆచారిని నియమించగా అవి నకిలీ బంగారు వస్తువులుగా ఆయన తేల్చాడు. దీంతో పర్లాకిమిడి బ్యాంక్ ఆఫ్ ఇండియా అప్రైజర్ గన్నవరపు బ్రహ్మం బంగారం వాల్యుయేషన్, నాణ్యత చూడకుండా మోసానికి పాల్పడి ఈ వ్యవహారం నడిపాడని బ్యాంకు అధికారులు నిర్ధారించారు. మోసానికి పాల్పడిన ఆయనను బ్యాంకు ప్రశ్నించగా మోసాన్ని ఒప్పుకుని, తనకు కొంత సమయం ఇస్తే గోల్డు రుణాలు తీసుకున్న వారి నుంచి డబ్బులు వసూలు చేస్తానని తెలియజేశారు. దీనిపై స్థానిక ఆదర్శ పోలీసుస్టేషన్‌లో బ్యాంకు అధికారులు ఫిర్యాదు చేయగా, ఐఐసీ బబులీ నాయక్ కేసు నమోదు చేశారు. కేసుకు సంబంధించి ప్రస్తుతం ఏడుగురు రుణగ్రస్తులను అరెస్టు చేశారు. మిగతా నలుగురిపై పోలీసులు నిఘా పెట్టారు. వీరిని సోమవారం కోర్టుకు తరలిస్తామని తెలియజేశారు.

# ‘నిరుద్యోగులకు ఉపాధి కరువు’



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి సుభాష్ చంద్రరావు

**పర్లాకిమిడి:** కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులకు ఉపాధి కరువయ్యిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి అభయ్ సాహు ఆరోపించారు. స్థానిక టౌన్ హాల్‌లో భారతీయ కమ్యూనిస్టు పార్టీ గజపతి జిల్లాస్థాయి జోనల్ కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, ఆర్గనైజింగ్ కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒడిశా రాష్ట్రంలోనూ 23 సంవత్సరాలుగా ఒకే ప్రభుత్వం అధికారంలో ఉన్నా కూలీలకు కనీస వేతనాలు లభించడం లేదని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో యువతకు ఎన్ని ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. సమావేశంలో ఛత్రపురం మాజీ ఎమ్మెల్యే ఎన్.నారాయణ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మండలి సభ్యులు డాక్టర్ ప్రశాంత్ మిశ్రా, జయంతి దాస్, ఆంధ్రప్రదేశ్ నుంచి ధర్మారావు, లోక్‌నాథ దొళాయి, జగన్నాథరావు, పి.పద్మ, గజపతి జిల్లా సీపీఐ కార్యదర్శి జోన్న సుభాష్ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



వేదికపై ఉన్న రాష్ట్రస్థాయి నాయకులు

# ‘రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి’



ఎస్పీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బీజేపీ మహిళా మోర్చా



ఎస్పీ సార్వణ్ వివేక్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**బరంపురం:** సీఎం నవీన్ పట్నాయక్ పాలనలో రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని బీజేపీ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సబతి పండా అన్నారు. స్థానిక ఎస్పీ కార్యాలయం ఎదుట బీజేపీ జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో శనివారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సబతి మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. కొరాపుట్ జిల్లా కుందిలి గ్రామంలో బాలికపై జరిగిన సాముహిక అత్యాచారం దీనికి ఉదాహరణగా నిలుస్తుందని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ సమయాల్లో మహిళలు అత్యాచారాలకు, లైంగిక వేదింపులకు గురవుతున్నారని ధ్వజమెత్తారు. వెంటనే ముఖ్యమంత్రి పదవి నుంచి సీఎం నవీన్ తప్పుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్పీ సార్వణ్ వివేక్‌కు వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో యువ మోర్చా కార్యదర్శి ఎస్.రాజేంద్ర, బికాష్, మనోజ్ సమంతరాయ్, సుభాషిని సాహు, కుందిలి పాత్రో, రాణి, మదన్ మోహన్ పాత్రో, మోహన్ దాస్, ప్రభాత్ సడంగి తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ అభివృద్ధికి రూ.18.91 కోట్లు

- నిధులు విడుదల చేసిన ప్రభుత్వం



పూజలందుకుంటున్న మా బుడి శాంతమ్మ

**బరంపురం:** బరంపురం గ్రామ దేవత, దక్షిణ ఒడిశా ఇలవేల్పు మా బుడి శాంత అమ్మవారు ఆలయ అభివృద్ధికి సీఎం నవీన్ పట్నాయక్ రూ.18.91 కోట్లను శుక్రవారం విడుదల చేశారు. ఈ నేపథ్యంలో శనివారం బరంపురం నగరంలో అధికార పార్టీ ఎంపీ చంద్రశేఖర్ సాహు, ఎమ్మెల్యే విక్రమ్ పండా, నగర మేయర్ సంఘమిత్ర దొళాయి, బీఎంసీ కార్పొరేటర్లు, బీజేడీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే విక్రమ్ పండా మాట్లాడుతూ త్వరలోనే ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభమవుతాయని తెలియజేశారు.



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేడీ శ్రేణులు

# నెక్కంటి ఇంటి వద్ద సంబరాలు



నెక్కంటి ఇంటి వద్ద కార్యకర్తల కోలాహలం

**రాయగడ:** రాజ్యసభ మాజీ ఎంపీ, బీజేడీ సీనియర్ నాయకుడు నెక్కంటి భాస్కరరావుకు పార్టీ అధిష్టానం రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు ఆ పార్టీ శ్రేణులు శనివారం సంబరాలు జరుపుకున్నాయి. స్థానిక రాణిగుడ ఫారం వద్దనున్న నెక్కంటి స్వగృహం వద్దకు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు చేరుకొని ఆనందాన్ని పంచుకున్నారు. పార్టీకి గత 50 ఏళ్లుగా విశేష సేవలు అందించిన నెక్కంటిని గుర్తించి ఉపాధ్యక్ష బాధ్యతలను అప్పగించినందుకు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, జిల్లా పరిశీలకుడు అతున్ సవ్యసాచి నాయక్, రాష్ట్ర బీజేడీ వ్యవహారాల శాఖ కార్యదర్శి ప్రణవ్ ప్రకాష్ దాస్ (బొబి)లకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి లాల్‌బిహారి హిమిరిక, రాయగడ మున్సిపల్ చైర్మన్ మహేష్ పట్నాయక్, బినాయక్ కర్, అమయ స్వాయి, కాసీపూర్ సమితి చైర్మన్ కొంతొ మారిఖి తదితరులు పాల్గొన్నారు.

### కడుపునొప్పి తాళలేక ఆత్మహత్యా యత్నం



చికిత్స పొందుతున్న పృథ్వీరాజ్

**పార్వతీపురం:** కడుపు నొప్పి తాళలేక ఓ యువకుడు ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. పార్వతీపురం మండలం టొంకి గ్రామానికి చెందిన ఎం.పృథ్వీరాజ్ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఉదయం కడుపునొప్పి రావడంతో భరించలేక ఇంటిలో మిగిలి వున్న పురుగుల మందును తాగి ఆత్మహత్యా యత్నం చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స కోసం డోకిశీల పీహెచ్‌సీకి తరలించి చికిత్సను అందించారు. మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

### వ్యక్తి ఆత్మహత్య



సింహచలంనాయుడు మృతదేహం

**పార్వతీపురం/జియ్యమ్మవలస:** ఆరోగ్య సమస్యలు తట్టుకోలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జియ్యమ్మవలస మండలం తురకనాయుడువలస గ్రామానికి చెందిన దాసరి సింహాచలంనాయుడు(73) తీవ్ర అనారోగ్యంతో కొన్నాళ్లుగా బాధపడుతున్నాడు. ఈ క్రమంలో బాత్‌రూం క్లీనింగ్‌కు వాడే లిక్విడ్‌ను తాగాడు. దీన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం 108 వాహనంలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే సింహాచలంనాయుడు మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. అవుట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### పాయల కవితకు ‘నాటా’అవార్డు




పాయల మురళీకృష్ణ

**విజయనగరం టౌన్:** ఉత్తర అమెరికా తెలుగు సమితి (నాటా) సాహిత్య వేదిక ప్రతిష్టాత్మకంగా 2023 సంవత్సరానికి ఉత్తమ కవితల విభాగంలో ఇటీవల పోటీలు నిర్వహించింది. ఆ పోటీల్లో ప్రముఖ కవి, రచయిత పాయల మురళీకృష్ణ రచించిన కవిత ‘గచ్చింసెట్టు కటూ ఇటూ’ కవిత వంద డాలర్ల బహుమతిని పొందిందని రచయిత పాయల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో పాయలను పలువురు సాహితీవేత్తలు హర్షం వ్యక్తం చేశారు.

### ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి ఏర్పాట్లు

**విజయనగరం క్రైమ్:** జిల్లాలో ఈ నెల 20 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు నిర్వహించనున్న అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి సంబంధించి ముందస్తు సన్నాహక ఏర్పాట్లపై సెట్విజ్ సీఈఓ రామ్‌గోపాల్ శనివారం ఆరా తీశారు. ఈ మేరకు సంబంధిత అధికారులతో సమావేశమై బారికేడ్లు, రన్నింగ్ ట్రాక్, విద్యుత్, తాగునీరు, వైద్యం, తదితర సదుపాయాలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీటీసీ ప్రిన్సిపాల్ ఆనందబాబు, ఆర్మీ రిక్రూట్‌మెంట్ అధికారు లు పాల్గొన్నారు.

# సాగునీటి కాలువలు దెబ్బతినకుండా చర్యలు



తామరపల్లి వద్ద రహదారి పనులకు సంబంధించి రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌డీవో సూర్యకళ, తహసీల్దార్

**గంట్యాడ:** జాతీయ రహదారి (హైవే) నిర్మాణంలో భాగంగా సాగు నీటి కాలువలు దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలని హైవే అధికారులకు ఆర్‌డీవో సూర్యకళ ఆదేశించారు. ఈ నెల 6వ తేదీన తాటిపూడి వద్ద జరిగిన సమావేశంలో రైతులు సాగునీటి కాలువలను మూసి వేసి హైవే అధికారులు రోడ్డు నిర్మాణం చేపడుతున్నారని వివిధ గ్రామాలకు చెందిన రైతులు ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన వెంటనే జాయింట్ కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. శుక్రవారం జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలోను ఇదే విషయాన్ని ఎమ్మెల్యే మంత్రి బొత్స దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శనివారం రెవెన్యూ ఇరిగేషన్, హైవే అధికారులు సంయుక్తంగా పర్యవేక్షణ చేశారు. రహదారికి సంబంధించిన మ్యాప్‌లు, సాగునీటి కాలువలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని ఆర్‌డీవో తెలిపారు. తహసీల్దార్ స్వర్ణకుమార్, ఇరిగేషన్ ఏఈ తమ్మినాయుడు పాల్గొన్నారు.

# రక్తదానానికి యువత ముందుకురావాలి

- రక్తదాన శిబిరంలో జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి



రక్తదానం చేస్తున్న యువతతో జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు బాబ్జి

**తెర్లాం:** జిల్లాలో నెలకొన్న రక్తం నిల్వల కొరతను యువతే తీర్చాలని, రక్తదానానికి యువత ముందుకు రావాలని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి కోరారు. శనివారం స్థానిక కల్యాణ మండపంలో మెగా రక్తదాన శిబిరం, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దత్తి సత్యనారాయణ వెల్ఫేర్ అసోసియేషన్, మాతృభూమి సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు యువతీ, యువకులు పాల్గొని, రక్తదానం చేశారు. అనంతరం వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని రోగులకు రక్తం అత్యవసరమైన సమయంలో రక్తం దొరకక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మరికొంతమంది రక్తం అందక మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి అర్థం చేసుకుని, స్వచ్ఛంద సంస్థల సహాయంతో మాతృభూమి సేవా సంఘం ఇప్పలవలస గోపాలరావు, ఎస్.వి.ఎస్ బ్లడ్ బ్యాంక్ అధినేత తాడేపల్లి నాగేశ్వరరావు సంయుక్తంగా వైద్యశిబిరాలు, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి, తమవంతు సేవలందిస్తుండడం అభినందనీయమన్నారు. రక్తదానంపై ఎంతోమందికి అపోహలు ఉన్నాయని, రక్తం దానం చేస్తే ఆరోగ్యం చెడిపోతుందని అనుకుంటారన్నారు. నిజానికి రక్తమిస్తే ఆరోగ్యానికి చాలా మంచిదన్నారు. ప్రతీ 3 నెలలకు ఒకసారి రక్తదానం చేయొచ్చన్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఈశ్వరప్రసాద్, గ్రామీణ వైద్యుల సంఘం నాయకులు సునీల్, మహేష్, నాగరాజు పాల్గొన్నారు.

### విత్తనశుద్ధితో తెగుళ్ల నివారణ



పాగిరిలో బీజామృతంతో విత్తనాలు శుద్ధి చేస్తున్న రైతులు

**రాజాం సిటీ:** బీజామృతంతో విత్తనశుద్ధి చేయడం ద్వారా పంటకు పట్టే చీడపీడలు, తెగుళ్లను నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయం పీఆర్‌పీ రమాదేవి తెలిపారు. శనివారం మండలంలోని పాగిరి గ్రామంలో బీజామృతంతో విత్తనాలు శుద్ధి చేయడంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఈ విధానం ద్వారా విత్తనం నుంచి గానీ, నేల నుంచి గానీ పంటకు తెగుళ్లు, చీడపీడలు పట్టవన్నారు. అలాగే మొలకశాతం పెరుగుతుందని, తద్వారా పంట దిగుబడి అధికంగా వస్తుందన్నారు. వీటితో పాటు విత్తనానికి కావాల్సిన పోషకాలు అందుతాయన్నారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా తయారు చేసిన బీజామృతం అన్ని ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ పి.వెంకటరమణ, రైతులు పాల్గొన్నారు.

### పెద్దగెడ్డ నీరు విడుదల రేపు

**సాలూరు:** పాచిపెంట మండల కేంద్రంలో గల పెద్దగెడ్డ రిజర్వాయర్ నీటిని సోమవారం విడుదల చేయనున్నట్టు పెద్దగెడ్డ డీఈ కనకారావు శనివారం తెలిపారు. నీటి విడుదలకు ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరను ఈ మేరకు ఆహ్వానించారు. శనివారం ఆయన గృహంలో కలిసి నీటి విడుదలకు రావాలని డీఈ కోరారు. ఈ సందర్భంగా నీటి విడుదలపై ఆయన అధికారులతో చర్చించారు. ఈ రిజర్వాయర్ ద్వారా పాచిపెంట, సాలూరు, రామభద్రపురం తదితర మండలాల్లో సుమారు 12 వేల ఎకరాలకు సాగునీరు అందనుందని అధికారులు తెలిపారు. జేఈ రవికుమార్, వెంకట్ ఉన్నారు.

# 12న కొబ్బరి-చిప్పల వేలం

**రాజాం సిటీ:** స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గ ఆలయంలో ఈ నెల 12వ తేదీన కొబ్బరి చిప్పల వేలంపాట నిర్వహించనున్నామని ఈఓ పొన్నాడ శ్యామలరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు సమర్పించిన కొబ్బరికాయలో సగభాగం వసూలు చేసుకునే హక్కుకు సంబంధించి, ఈ వేలం నిర్వహించడం జరుగుతుందన్నారు. అధిక మొత్తంలో ఈ పాటను దక్కించుకున్న వారికి ఈ నెల 13 నుంచి 2025 జూలై 14వ తేదీ వరకు కాలపరిమితి ఉంటుందన్నారు. వేలం పాటలో పాల్గొనాలకునే వారు ముందుగా రూ.20 వేలు డిపాజిట్ చేయాలని తెలిపారు. పాట దక్కించుకున్నవారు పాడిన మొత్తంలో సగం సొమ్మును వెంటనే చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయం పనివేళల్లో సంప్రదించాలని కోరారు.

# భారీ వాహనం తరలి రాగా...



ఏబీ రోడ్డుపై 96 టైర్లు వాహనంపై యంత్ర పరికరం

**భామిని:** మండలంలోని ఏబీ రోడ్డులో శనివారం ప్రయాణించిన అతి భారీ వాహనం చూపరులను అలరించింది. అతి పెద్ద ట్రాన్స్‌ఫార్మర్ లాంటి యంత్ర పరికరాన్ని తరలిస్తున్న అతి భారీ వాహనం ఆకట్టుకొంది. ట్రాన్స్‌ఫార్మర్ లాంటి యంత్ర పరికరాన్ని 96 టైర్లు గల తారాస్‌పై బిగించారు. వరుసకు 8 టైర్లు చొప్పున్న 12 వరుసలు గల ట్రాలీపై అమర్చారు. మరో 18 టైర్లు గల ఇంజిన్‌తో లాగిస్తుండడం విశేషం. ప్రస్తుతం భామిని మండలం బిల్లుమడ – సింగిడి గ్రామాల మధ్య రోడ్డుపై నిలిపివేశారు. రోడ్డుపై ప్రయాణానికి క్లియరెన్స్ లేక నిలిపివేయడంతో ప్రజలు అసక్తిగా తిలకిస్తున్నారు. విశాఖ షిప్‌యార్డ్ నుండి చత్తీస్‌గఢ్‌కు ఈ భారీ వాహనం వెళ్తుంది.

## క్లుప్తంగా

### ఉత్సాహంగా జిల్లా ఉషూ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న హారికా ప్రసాద్, సుందరరావు, ఉషూ సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి జూనియర్స్, సబ్‌జూనియర్స్ ఉషూ క్రీడా ఎంపిక పోటీలు హుషారుగా జరిగాయి. శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రాంగణంలో శనివారం జిల్లా ఉషూ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పొగిరి కృష్ణంనాయుడు, రెడ్డి శివకుమార్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఎంపికలతోపాటు చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. పోటీలు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన స్విమ్మింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు హారిక ప్రసాద్ మాట్లాడుతూ క్రీడాకారులుగా ఉంటూ భవిష్యత్‌కు బంగారు బాటలు వేయవచ్చన్నారు. తన కుమార్తె హారిక నేషనల్ స్విమ్మర్ కావడం వల్ల ఎంబీబీఎస్ సీటు సాధ్యమైందని తెలిపారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ముఖ్య సలహాదారు పి.సుందరరావు మాస్టారు మాట్లాడుతూ అనుభవమున్న శిక్షకుల ద్వారానే క్రీడాకారులు మరింతగా రాణిస్తారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి జూనియర్స్, సబ్‌జూనియర్స్ బాలబాలికల ఉషూ చాంపియన్‌షిప్-2023 పోటీలు ఈనెల 15,16 తేదీల్లో శ్రీకాకుళం జిల్లా వప్పంగి వేదికగా జరగనున్నాయని జిల్లా ఉషూ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రెడ్డి శివకుమార్ తెలిపారు. జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారుల జాబితాను త్వరలో వెల్లడిస్తామన్నారు.

### ఆదిత్యుని సన్నిధిలో ఏపీఎస్ జీడీ ఫెడరేషన్ చైర్మన్



చైర్మన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఈవో

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ జి.ప్రకాశం యాదవ్ శనివారం దర్శించుకున్నారు. ఈవో వి.హరిసూర్య ప్రకాష్ గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అర్చకులు వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేసారు. కార్యక్రమంలో సమాఖ్య డైరెక్టర్లు గంటా శ్రీరామ్, డీవీఎస్ఎన్ మూర్తి, కృష్ణ, ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు, అర్చకులు ఇప్పిలి ఫణీంద్ర శర్మ తదితరులు పాల్గొన్నారు.

### శాకంబరిగా లలితాదేవి



శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని మొండేటివీధిలో లలితా సమేత శివకామేశ్వరస్వామి దేవాలయంలో ఆషాఢ మాసం సందర్భంగా లలితా దేవిని శాకంబరిగా శనివారం అలంకరించారు. షిరిడీసాయి సేవా సంఘం, అర్చకులు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. అనంతరం లలితా సహస్ర పారాయణం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

### నేడు శిష్టకరణ సంఘ కార్యవర్గ సమావేశం

అరసవల్లి: స్థానిక ఎస్వీడీ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం ఉదయం 9 గంటలకు జిల్లా శిష్టకరణ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా సంఘ ప్రధాన కార్యదర్శి డబ్బీరు శ్రీనివాసరావు (వాసు) ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా సంఘ అభివృద్ధి, నూతన కార్యవర్గ ఎన్నికలు, ఓబీసీ జాబితాలో చేర్చనున్న అంశాలు ప్రధాన ఎజెండాగా సమావేశం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. సంఘ ప్రతినిధులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

### వ్యక్తి అదృశ్యం

శ్రీకాకుళం క్రైమ్ : అతిగా మద్యం తాగి రావద్దని భార్య చెప్పడంతో నగరంలో గుడి వీధికి చెందిన మారడాన చినబాబు (34) అనే వ్యక్తి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయినట్లు ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ బలివాడ గణేష్ తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

### పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని ఈదుపురంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై రూరల్ ఎస్ఐ వి.రమేష్ ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. వీరి వద్ద నుంచి రూ.11,300 నగదు స్వాధీనం చేసుకున్నారు.

# రైతు శ్రేయస్సే.. సమాజ శ్రేయస్సు

- వ్యవసాయం దండగ కాదు పండుగ అని నిరూపించారు
- రైతు దినోత్సవంలో స్పీకర్ తమ్మినేని సీతారాం
- జిల్లాలో 1094 మంది రైతులకు రూ. 31.73 లక్షలు బీమా ప్రీమియం చెల్లింపు



లబ్ధిదారునికి చెక్కులు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ):

రైతు బాగుంటేనే సమాజం బాగుంటుందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని శనివారం అనంతపురం జిల్లా కళ్యాణ దుర్గంలో, రాష్ట్ర స్థాయి రైతు దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో రైతు దినోత్సవం నిర్వహించారు. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా 2022 ఖరీఫ్‌లో పంట లు నష్టపోయిన 1094 మంది జిల్లా రైతులకు రూ. 31.73 లక్షలు బీమా ప్రీమియం చెల్లించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్పీకర్ తమ్మినేని సీతారాం మాట్లాడుతూ మహనీయులకు జయంతులే తప్ప వర్ధంతులు ఉండవన్నారు. వ్యవసాయం దండగ నుంచి పండగ అనేలా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తీసుకువచ్చారని, దాన్ని మరింత బలోపేతం చేసే దిశలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకా లు దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొ న్నారు. రైతులకు రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వం రైతుల తరఫున బీమా పాలసీ కట్టి ఈ-క్రాప్ వచ్చిన తరువాత పంట నష్టం కలిగితే పరిహారం అందిస్తారన్నారు. ఎచ్చెర్ల మండలంలో ఉచిత పంటల బీమా పథకం కింద 1094 మంది రైతులకు రూ. 31.73 లక్షల ప్రీమి యం సొమ్మును రైతుల వ్యక్తిగత ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు.

రైతు దినోత్సవం

రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయిన వెంటనే ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు ఎరువులు ఇచ్చిందన్నారు. రైతులకు ఎలాంటి సమస్యలు ఉన్నా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ-క్రాప్‌లో రైతులు పంటల వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ వైఎస్సార్ జయంతిని రైతు దినోత్సవాన్ని ప్రభుత్వ కార్యక్రమంలా జరుపుకోవడం ఎంతో ఆనందాయకమన్నారు. రైతులకు సంబంధించిన ఏ పథకమైనా అప్పట్లో వైఎస్సార్ ట్రేడ్ మార్క్ అయ్యేదన్నారు. నేడు సీఎం జగన్‌మోహన్ రెడ్డి రైతు బాంధవుడయ్యారని అన్నారు. ఏపీలో అమలు చేస్తున్న రైతు విధానాలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నారన్నారు.

కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ జిల్లాలో 1094 మంది రైతుల ఖాతాల్లో రూ. 31.73 లక్షలు బీమా ప్రీమియం చెల్లింపు, జిల్లాలో 390 ఎస్సీ రైతులకు గుర్తించి విత్తనాలు, ఇతర ఉపకరణాల కోసం ఒక్కో రైతుకు రూ.10,000 చొప్పున పీఎం అజయ్ పథకం కింద అందించినట్లు తెలిపారు. జిల్లాలో 607 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయని, వాటి ద్వారా విత్తనాలు, ఎరువులు అందజేస్తున్నట్లు తెలిపారు.

మాజీ డిప్యూటి సీఎం, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ వైఎస్సార్ మహానేత అని, పేద ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారనీ కొనియాడారు. వైఎస్ఆర్ ఆనాడు తీసుకువచ్చిన సంస్కరణల ఫలితంగా తెలుగు రాష్ట్రాల్లో అనేక కుటుంబాల నుంచి విద్యార్థులు ప్రయోజకులుగా మారి వారి కుటుంబాలనే కాక, వారు నివసిస్తున్న ప్రాంతాల్లో ఉండే ప్రజలకు మార్గదర్శకులై నిలుస్తున్నారన్నారు. ఆయన స్ఫూర్తితో సీఎం వైఎస్ జగన్ తన పాలనలో మరింత ముందుకు తీసుకువెళ్తున్నారన్నారు.

జిల్లా షెడ్యూల్ కులాల సేవా సహకార సంస్థ, ఈడీ గడ్డెమ్మ మాట్లాడుతూ పీఎం అజయ్ పథకం కింద ప్రకృతి వ్యవసాయం చేస్తున్న షెడ్యూల్ కులాల రైతులకు విత్తనాల పంపిణీ ఉంటుందన్నారు. అనంతరం నమూనా చెక్కులు, విత్తనాల కిట్లు అందించారు.

కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, కళింగ కోమటి కార్పొరేషన్ అధ్యక్షుడు అందవరపు సూరిబాబు, మహిళా స్టేట్ ఫైనాన్ కార్పొరేషన్ చైర్ పర్సన్ హేమమాలిని రెడ్డి, వ్యవసాయ బోర్డు సలహా మండలి అధ్యక్షుడు నేతాజి, అగ్రిమిషన్ మెంబర్ గొండు రఘు, పొందర, కూరాకుల కార్పొరేషన్ చైర్ పర్సన్ రాజాపు హైమావతి, పొన్నాడ రుషి, రుప్ప దివ్య, అంబటి శ్రీను, ఎన్ని ధనుంజయరావు, అంధవరపు రమేష్, రత్నాల నరసింహమూర్తి, కోణార్క్ శ్రీను, ఏడిఏలు, ఏవోలు, ఎస్సీ రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### సీఎంగా జగనే ఉండాలి



అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే సొంతం. ప్రభుత్వం అందిస్తున్న అమ్మఒడి, రైతు భరోసా వంటి పథకాలు నాకు అందుతున్నాయి. నేను ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాను. అందుకు ఎస్సీ కార్పొరేషన్ ఎంతో సాయం చేస్తోంది. పీఎంఏజేఏవై కింద విత్తనాలు అందుకున్నాను. ఆ ఆయన ఆటో డ్రైవర్ కావడంతో వాహన మిత్ర కూడా వస్తోంది. వైఎస్ జగనే ఎప్పటికీ సీఎంగా ఉండాలి.

– మెరక పూర్ణ, కుశాలపురం, ఎచ్చెర్ల మండలం

## 'నగరాల' విద్యార్థులకు ప్రోత్సాహకాలు

శ్రీకాకుళం కల్చరల్: పది, ఇంటర్మీడియెట్‌లో ప్రతిభావంతులైన నగరాల సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు నగరు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు జిల్లా నగరాల సంఘం అధ్యక్ష కార్యదర్శులు నల్లాన ప్రభాకరరావు, పండు రాజగోపాల్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్థికంగా వెనుకబడిన నగరాల కులస్తుల్లో అత్యధిక మార్కులు పొందిన ప్రతిభావంతులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 'నగరాల ప్రోత్సాహక విద్యా కానుక' కార్యక్రమాన్ని గత ఏడాది ప్రారంభించామని పేర్కొన్నారు. అర్హత కలిగిన వారు మార్కులు వివరాలను ఈ నెల 18లోగా జిల్లా నగరాల ఉపాధ్యక్షుడు ఇల్లిపల్లి నీలంనాయుడు సెల్ నంబర్:9490903839కు వాట్సాప్ మెసేజ్ చేయాలని కోరారు. మరిన్ని వివరాలకు బీసీ నగరాల కార్పొరేషన్ డైరెక్టర్లు కొరికాన మోహనరావు, పిల్లా ఆనంద్, సంఘం కోశాధికారి బెవర వెంకట రవిశంకర్‌లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

## అదృశ్యమయ్యాడు.. శవమై తేలాడు



రిమ్స్ మార్చురీలో సతీష్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

శ్రీకాకుళం క్రైమ్ : ఈ నెల 6న అదృశ్యమైన శ్రీకాకుళం నగరంలోని గుజరాతీ పేట పొందరవీధికి చెందిన మారోజి సతీష్ (38) శనివారం నాగావళి నదిలో శవమై తేలియాడాడు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పప్పల శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. సతీష్‌కు మణితో ఆరేళ్ల కింద వివాహమైంది. వీరికి ఐదేళ్ల పాప వర్షిణి, ఏడాదిన్నర బాబు సంపత్‌నందు ఉన్నారు. మూడేళ్లుగా మహేంద్ర షోరూంలో సేల్స్‌మేన్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 6న ఇంటి నుంచి షోరూంకు వెళ్లిన సతీష్ ఫోన్ స్విచ్చాఫ్ రావడంతో భార్య ఈ నెల 7న పోలీసులకు ఫిర్యాదు చేసింది. శనివారం ఉదయం నాగావళి నదిలో (పెద్దగా లోతు లేని ప్రదేశంలో) మృతదేహం తేలడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సోదరుడు విజయ్ ఘటనా స్థలానికి వెళ్లి సతీష్ మృతదేహమే అని నిర్ధారించాడు. కుటుంబ కలహాలేవీ లేవని, కొద్దిగా అప్పులుండటం, అప్పుడప్పుడూ మద్యం తాగే అలవాటున్నట్లు అతని భార్య మణి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్ఐ లక్ష్మణరావు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

### ప్రగతి నివేదికలు అందజేయాలి

అరసవల్లి: జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశాలను ఈ నెల 12న జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న నేపథ్యంలో ఇంకా పలు ప్రభుత్వ శాఖలు తమ ప్రగతి నివేదికలు జెడ్పీ కార్యాలయానికి సమర్పించలేదని..త్వరగా సమర్పించాలని జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్‌రామన్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రగతి నివేదికలు ఇవ్వని ప్రభుత్వ శాఖల అధికారుల జాబితాను జిల్లా కలెక్టర్ కార్యాలయానికి నివేదిస్తామని పేర్కొన్నారు.

## దళారుల చేతిలో మోసపోవద్దు



సదస్సులో మాట్లాడుతున్న మోహన్‌రావు

వజ్రపుకొత్తూరు రూరల్: ఉద్దాన జీడి రైతులు కష్టపడి పండించిన జీడి పంటను దళారుల చేతిలో పెట్టి మోసపోవద్దని ఏపీ రైతు సంఘ జిల్లా కార్యదర్శి కోనారి మోహన్‌రావు అన్నారు. మెట్టూరులో శనివారం జీడి రైతు సంఘం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడి పిక్కల ధర దారుణంగా పడిపోయిందని దళారులు చెబుతూ గ్రామాల్లో రైతులను దగా చేస్తున్నారని మండిపడ్డారు. ఎక్కడైనా కార్మికులు వారి హక్కుల కోసం బంద్ చేస్తారని, పలాసలో మాత్రం జీడి పరిశ్రమ యాజమాన్యాలు బంద్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. జీడి పంటను దోచుకోవడానికి ఇదొక ఎత్తుగడ అని మండిపడ్డారు. ఉద్దాన రైతుల ఐక్యమత్యంతో మద్దతు ధర సాధించాలని పిలుపునిచ్చారు. 80 కేజీల జీడి పిక్కలను రూ.16 వేలు మద్దతు ధరకు రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాలు, పలు పార్టీ నాయకులు అర్జల అజయ్‌కుమార్, కొండాపు సురేఖ, తిర్రి రాజారావు, బత్తిని లక్ష్మినారాయణ, సాతుపల్లి కృష్ణారావు, డి.జేజేరావు, జి.చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు జిల్లాస్థాయి తైక్వాండో ఎంపిక పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి తైక్వాండో ఎంపిక పోటీలు శ్రీకాకుళం నగరంలోని ఏడురోడ్ల కూడలి సమీపంలో ఉన్న వైఎస్సార్ కల్యాణ మండపం వేదికగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి జరగనున్నాయి. జూనియర్స్, క్యాడెట్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో బాలబాలికలకు వేరువేరుగా నిర్వహిస్తున్న ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేయనున్నారు. ఎంపికై న వారిని త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తారు. జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో పోటీలకు హాజరుకావాలని తైక్వాండో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తైక్వాండో శ్రీను తెలిపారు.

### సీపీఎస్ రద్దు చేయాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు

శ్రీకాకుళం పాతబస్టాండ్ : సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతూ సీపీఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు, చల్లా దుర్గాప్రసాద్, గురుగుబెల్లి భాస్కరరావు, వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ పెన్షన్ భారాన్ని తగ్గించుకోవడానికి ప్రపంచ బ్యాంకు సూచనల మేరకు కేంద్ర ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని రద్దు చేసిందన్నారు. దాని స్థానంలో సీపీఎస్ విధానం తీసుకువచ్చిందని, దీనివల్ల ఉద్యోగులు పింఛను హక్కు కోల్పోతున్నారని చెప్పారు. ఉద్యమాన్ని ఉధృతం చేసి పాత పెన్షన్‌ను సాధించుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు బోకర బాలకృష్ణ, తూముల సూర్యారావు, రెడ్డి సూరిబాబు, బెందాలం శోభన్‌బాబు, కొత్తపల్లి ప్రకాష్, శరత్, బొనిగి శ్యామ్, బాడాన రాజు, కొప్పల భానుమూర్తి, సంపతిరావు కిషోర్, మజ్జి మదన్‌మోహన్, టెంక చలపతిరావు, దానేటి కేశవరావు, తంగి మురళి, పిసిని వసంతరావు, కోత ధర్మారావు,సనపల నర్సింగరావు, రమణ, బోనెల రమేష్ శ్రీనివాసరావు, కూన రంగ, పప్పల రాజశేఖర్, గొంటి గిరిధర్, సీపీఎం నాయకులు తేజేశ్వరరావు పాల్గొన్నారు.

## చెక్‌పోస్టు కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు

- అనధికారికంగా రూ.2,20,800 వసూలు చేసినట్లు గుర్తింపు
- ముగ్గురికి రిమాండ్



కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న ఏసీబీ సిబ్బంది

ఇచ్ఛాపురం: పురపాలక సంఘం పరిధిలోని పురుషోత్తపురం వద్ద ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు కార్యాలయంలో శుక్రవారం అర్ధరాత్రి ఏసీబీ డీఎస్పీ బి.వి.ఎస్.ఎస్.రమణమూర్తి ఆధ్వర్యంలో సిబ్బంది ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఏడేళ్ల కిందటే చెక్‌పోస్టు ఎత్తివేసినప్పటికీ ఈ కార్యాలయంలో రవాణాశాఖ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వాహనదారుల నుంచి వీరు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఏసీబీ కార్యాలయానికి సమాచారం అందడంతో దా డులు ఈ చేపట్టారు. ఈ సమయంలో ఎంవీఐ గోపీకృష్ణ, ఏఎంవీఐలు ఉషా, అప్పన్న, కానిస్టేబుల్ నాగభూషణం జేబుల్లో రూ. 23,800 నగదు (అనధికారికంగా వసూలు చేసినది) ఉన్నట్లు గుర్తించారు. అనంతరం కార్యాలయంలో సోదాలు నిర్వహించగా బీరువాలో రూ. 1,97,000 ఉన్నట్టు గుర్తించారు. ఈ సందర్భంగా డీఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ అక్రమంగా ఉన్న రూ.2,20,800ను స్వాధీనం చేసుకొని ముగ్గురిపై కేసు నమోదుచేసి విశాఖపట్నానికి రిమాండ్‌కి తరలించినట్లు వెల్లడించారు. తనిఖీల్లో ఏసిబి సీఐలు భాస్కర్‌రావు, హరి, ఎస్ఐలు చిన్నంనాయుడు, సత్యారావు, సిబ్బంది పాల్గొన్నారు.

# గొట్టా బ్యారేజీ నుంచి నీటి విడుదల



సాగునీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి, ఎస్ఈ తిరుమలరావు

హిరమండలం: ఖరీఫ్‌లో శివారు ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, వంశధార ఎస్ఈ డోల తిరుమలరావు అన్నారు. గొట్టా బ్యారేజీ నుంచి శనివారం కుడి, ఎడమ ప్రధాన కాలువలోకి నీరు విడుదల చేశారు. ముందుగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గేట్లు ఎత్తివేసి నీటిని విడుదల చేశారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతి మాట్లాడుతూ జిల్లాను సస్యశ్యామలం చేస్తున్న గొట్టా బ్యారేజీ పాతపట్నం నియోజకవర్గంలో ఉండడం ఆనందించదగ్గ విషయమన్నారు. వంశధార ఫేజ్-2 రిజర్వాయర్ నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావచ్చాయన్నారు. డిసెంబర్ నెలాఖరు నాటికి ప్రాజెక్టును జాతికి అందిస్తామని చెప్పారు. ఎస్ఈ డోల తిరుమలరావు మాట్లాడుతూ.. ఈ ఏడాది అనుకున్న సమయంలో వర్షాలు పడలేదన్నారు. ఇటీవల ఐదారు రోజులుగా ఒడిశాలో పడిన వర్షాలకు వచ్చిన నీటిని బ్యారేజీలో నిల్వ ఉంచామన్నారు. ప్రస్తుతం 38.8 మీటర్ల నీటి మట్టం ఉందన్నారు. ఎడమ ప్రధాన కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, కుడి ప్రధాన కాలువ ద్వారా 200 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టనున్నట్లు తెలిపారు. క్రమేపీ క్యూసెక్కులు పెంచుతామన్నారు. శివారుకు కూడా నీరందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వంశధార కట్టడాల విభాగం ఈఈ ఎంవీ రమణ, నరసన్నపేట ఈఈ ప్రదీప్, ఇన్‌చార్జ్ డీఈఈ అనిల్‌కుమార్, డీఈ ఎంవీ సురేష్‌కుమార్, జేఈ ధనుంజయరావు, ఏఈ పరిశుద్ధబాబు, సత్యనారాయణ, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి వ్యాపారం గుట్టు రట్టు

- 28 కేజీల గంజాయి స్వాధీనం
- ఐదుగురిని అదుపులోకి తీసుకొన్న పోలీసులు



టెక్కలి రూరల్:పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయితో పాటు నిందితులు

ఇచ్ఛాపురం: ఆంధ్రా- ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ఆదర్శ పాఠశాల సమీపంలో గుట్టుగా సాగుతున్న గంజాయి వ్యాపారాన్ని శనివారం ఇచ్ఛాపురం పట్టణ పోలీసులు రట్టుచేశారు. 14 బస్తాల్లోని 27.710 కేజీల గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనంతో పాటు గంజాయిని తరలిస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ జి.నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ గంజాయి, నిషేధిత మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ఎస్పీ రాధిక పర్యవేక్షణలో గంజాయి అక్రమ రవాణపై నిఘా పెంచినట్లు తెలిపారు. ఈ క్రమంలో ప్రత్యేక దాడులు చేయగా పురుషోత్తపురం గ్రామానికి చెందిన బుగ్గ సావిత్రి, దనపాన కృష్ణ, బుగ్గ చిరంజీవి, రెయ్యి త్రినాథం, ఒడిశా రాష్ట్రం కె.సువానికి చెందిన బిమ్మో బెహరలను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఒడిశాకి చెందిన మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు చెప్పారు. వీరి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని పేర్కొన్నారు. మత్తు పదార్థాలు వినియోగిస్తున్నట్లు ఎక్కడ గమనించినా తమకు తెలియజేయాలని, వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. సమావేశంలో సీఐ ఆర్.ఈశ్వర్‌చంద్రప్రసాద్, ఎస్ఐ కె.గోవిందరావు, క్రైం సిబ్బంది పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం: స్వాధీనం చేసుకున్న గంజాయితో డీఎస్పీ నాగేశ్వరరెడ్డి

### 22 కిలోల గంజాయి స్వాధీనం

టెక్కలి రూరల్: ఒడిశా నుంచి టెక్కలి వైపు గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను టెక్కలి పోలీసులు శనివారం స్థానిక మెళియాపుట్టి రోడ్డులో గల వంశధార కాలువ సమీపంలో పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 22 కిలోల గంజాయితో పాటుగా ఒక ద్విచక్రవాహనం, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ ఎల్.రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు.. టెక్కలికి ఆది ఆంధ్రావీధికి చెందిన చిత్త ఎర్రయ్య(పుష్పరాజ్) అనే వ్యక్తి అక్రమంగా గంజాయి తీసుకువచ్చి టెక్కలిలోని యువకులకు అమ్ముతున్నాడనే సమాచారం మేరకు పోలీసులు అతడిపై నిఘా పెట్టారు. ఈ మేరకు శనివారం పర్లాఖిమిడికి చెందిన సర్వసుద్ధి బాలాజీ(బాలు)తో కలిసి అతడు టెక్కలికి గంజాయి తీసుకువస్తున్నాడనే సమాచారం అందడంతో మెళియాపుట్టి రోడ్డులో గల వంశధార కాలువ సమీపంలో వాహన తనిఖీలు నిర్వహించగా.. వారు దొరికిపోయారు. బాలాజీపై గతంలో బత్తిలి, హిరమండలంలో చోరీ కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకుని బైక్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఎర్రయ్య కాల్‌లిస్ట్ సేకరించి గంజాయి తీసుకుంటున్న వారికి కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం



ఈవోకు నగదు అందజేస్తున్న దాతలు

అరసవల్లి:అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధి పనులకు విశాఖపట్నానికి చెందిన బి.రమేష్‌నాయుడు, శ్రీలత దంపతులు రూ.1,00,116 విరాళాన్ని శనివారం ఈవో వి.హరిసూర్యప్రకాష్‌కు అందజేశారు. దాతల సహాయంతో జరుగుతున్న పనులను ఈవో వివరించారు. రూ.లక్షకు మించి విరాళాలను అందజేసిన దాతలకు విశిష్ట పర్వదినాల్లో డోనర్ పాసులు అందజేస్తామన్నారు.

### రక్తదాతకు సత్కారం



రవికుమార్ సాహుని సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్ : లయన్స్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో సేవలందిస్తున్న నిరంతర రక్త సేవకుడు రవికుమార్ సాహు అని లయన్స్ సెంట్రల్ శ్రీకాకుళం చైర్మన్ నటుకుల మోహన్ అన్నారు. లయన్స్‌బ్లడ్ బ్యాంక్‌కు అత్యధిక బ్లడ్ యూనిట్లు అందించిన రవికుమార్‌ను శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ రవికుమార్ వృత్తిరీత్యా సారవకోట సచివాలయంలో వెటర్నరీ విభాగంలో సేవలు అందిస్తూ శ్రీకాకుళంలో రక్త కొరతను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి వరకూ కొన్ని వేల యూనిట్ల బ్లడ్‌ను లయన్స్ బ్లడ్ బ్యాంక్‌కు అందించడం ఆనందకరంగా ఉందన్నారు.

### ముమ్మరంగా వాహన తనిఖీలు

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలో శనివారం రాత్రి 8:30 గంటల వరకు ముమ్మరంగా వాహనాల తనిఖీలు జరిగాయి. ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశాల మేరకు విజుబుల్ పోలీసింగ్‌లో భాగంగా ఒకటో పట్టణ, రెండో పట్టణ పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు బలివాడ గణేష్, నాగిరెడ్డి లక్ష్మణరావులు తనిఖీలు చేపట్టారు. త్రిబుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, వితౌట్ లైసెన్సు, ఇన్సూరెన్సు, ర్యాష్ డ్రైవింగ్ తదితర కేసులు కట్టినట్లు చెప్పారు. ఒకటో పట్టణ పరిధిలో ఆరు కేసులు, రెండో పట్టణ పరిధిలో 30 కేసులు నమోదు చేశామని తెలిపారు.